సాక్షి వనపర్తి

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

వేసవిలో చోరీలు జరగకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

వివరాలు 8లో ▸



మృత్యు శకటాలు

ఉమ్మడి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం

41.0 /26.5

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. వేడి గాలులు వీచే అవకాశం ఉంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది.

ఇఫ్తార్ 6-38
(బుధవారం సాయంత్రం)

సహర్ 4-33
(గురువారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేడు బహిరంగ వేలం

వనపర్తిటౌన్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పురపాలికలోని తైబజార్, పశువుల సంత, జంతు వధశాల బహిరంగ వేలం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి పుర కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని.. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకొని పాల్గొనాలని సూచించారు. గతంలో దరఖాస్తులు రానందుకు వేలాన్ని మార్పుచేస్తూ వచ్చామని పేర్కొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



కొత్తకోట: ఐకేపీలో విధులు నిర్వర్తించే గ్రామ సంఘం సహాయకుల(వీవోఏ)ను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న సమ్మె మంగళవారం రెండోరోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత, కనీసం వేతనం రూ.26, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులతో పాటు గ్రామసంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలన్నారు. ఇప్పటికి 7 నెలల వేతనాలు బకాయి ఉన్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహ, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షురాలు అరుణ, కోశాధికారి శ్రీలత పాల్గొన్నారు.

25న నిరుద్యోగ మార్చ్

పాలమూరు: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈనెల 23న రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో ఈనెల 21న మహబూబ్‌నగర్‌లో నిర్వహించాల్సిన మిలియన్ నిరుద్యోగ మార్చ్ ఈ నెల 25కు వాయిదా వేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి తెలిపారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు ఒక ఎత్తు అయితే.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ మరో ఎత్తు అన్నారు. దేశంలో తెలంగాణ ప్రభుత్వం అభాసుపాలైందని, టీఎస్‌పీఎస్సీ ఏర్పాటు నాటి నుంచి ఇప్పటి వరకు అన్ని తప్పిదాలే జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల 30లక్షల మంది నిరుద్యోగ యువత రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు పరీక్ష పత్రాలు లీకేజీ కావడం అంటే సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి జైలుకు పంపించడం కాకుండా సీఎంకు చిత్తశుద్ధి ఉంటే అన్ని తానై వ్యవహరిస్తున్న మంత్రి కేటీఆర్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జీవితాలతో ఆడుకుంటున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దుచేసి.. నూతన బోర్డును ఏర్పాటు చేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలన్నారు. పేపర్ లీకేజీ కావడంతో నష్టపోయిన నిరుద్యోగులకు లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న నిర్వహించే నిరుద్యోగ మిలియన్ మార్చ్ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ పోరాటానికి మద్దతు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న వైఫల్యాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇది కేవలం బీజేపీ సంబంధించిన విషయం కాదని, తెలంగాణ నిరుద్యోగ యువత భవితవ్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి, ఎగ్గని నర్సింహులు, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణయాదవ్ పాల్గొన్నారు.



విపత్తుల నివారణే లక్ష్యం



వారోత్సవాల్లో భాగంగా గద్వాలలోని ఓ ఆస్పత్రిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు
- అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది
- ప్రజలను చైతన్యం చేసేందుకే...

అమరచింత: పశుగ్రాసాలకు మంటలు, షార్ట్ సర్క్యూట్లు, పేలుళ్లవంటి ఘటనలు జరిగిన సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడటమే లక్ష్యంగా అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే మేమున్నామంటూ ఘటనా స్థలాలకు చేరుకొని నివారణ చర్యలు చేపడుతున్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో వేసవిలో అగ్ని ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగినప్పుడు ఎలా నియంత్రించాలో అవగాహన కల్పిస్తూ తమను తాము ఎలా రక్షించుకోవాలో సలహాలు, సూచనలిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు కొనసాగే అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కథనం..

అగ్నిమాపక సిబ్బంది జ్ఞాపకార్థం..

1944, ఏప్రిల్ 14న ముంబై విక్టోరియా డాక్‌యార్డ్‌లో ఒక నౌక అగ్ని ప్రమాదానికి గురై 66 మంది అగ్నిమాపక సిబ్బంది అసువులు బాసారు. వారి స్మారకార్థం ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులు అర్పించడంతో పాటు ప్రజలు అగ్ని ప్రమాదాల బారిన పడకుండా తమను తాము ఎలా రక్షించుకోవాలన్న విషయాలపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.

డివిజన్ పరిధిలో ఇలా..

గద్వాల అగ్నిమాపక డివిజన్ పరిధిలో గద్వాలతో పాటు వనపర్తి జిల్లాలోని వనపర్తి, ఆత్మకూర్, కొత్తకోట, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, అమ్రాబాద్, కల్వకుర్తిలో ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. 2018 నుంచి 2020 వరకు ఆయా ఫైర్‌స్టేషన్ల పరిధిలో పెద్ద ప్రమాదాలు 25, మధ్యస్థ ప్రమాదాలు 50, చిన్న చిన్న ప్రమాదాలు 1,828, రెస్క్యూ కేసులు 111 జరిగాయి. మొత్తంగా 2,014 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఆస్తి నష్టం రూ.33 కోట్ల 27 లక్షల 68 వేల 900 కాగా.. కాపాడిన ఆస్తి విలువ రూ.126 కోట్ల 46 లక్షల 80 వేలు. మొత్తంగా 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 100 మందిని రక్షించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రెస్క్యూ ప్రమాదాలు అత్యధికంగా వనపర్తి అగ్నిమాపక కేంద్రం పరిధిలో చోటు చేసుకున్నాయి. 2018 నుంచి ఇప్పటి వరకు కొల్లాపూర్ పరిధిలో 16 రెస్క్యూ ప్రమాదాలు జరుగగా.. 2019లో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్కువ ఆస్తినష్టం కేసులు నమోదయ్యాయి.

ప్రజలను చైతన్యపర్చేందుకే..



అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజలకు అగ్నిప్రమాదాల నుండి ఎలా రక్షించుకోవాలనే విషయాల పై అవగాహన కల్పిస్తున్నాం. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలంకు చేరుకోక ముందే ప్రజలు ప్రాథమికంగా చెయ్యల్సిన సహాయం గురించి వివరిస్తు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అన్న విషయాలను వివరిస్తున్నాం. వేసవిలో అధికంగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని వీటిని అరికట్టడంతో ప్రజలు తమ సిబ్బందికి పూర్తి సహకారాలు అందించి నపుడే ప్రమాదాలను నివారించవచ్చు.

– శ్రీదాస్, డీఎఫ్ఓ, గద్వాల



అమరచింతలోని డంపింగ్‌యార్డులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు..

వేసవిలోనే అత్యధికంగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని.. ముందస్తు జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై అగ్నిమాపక సిబ్బంది బస్టాండర్లు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, కూడళ్లలో అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. విద్యుత్, నిప్పు, విపత్తులు సంభవించినప్పుడు సమీపంలోని ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వాలని.. అప్పుడే ప్రమాదం నివారించే అవకాశం ఉందన్నారు. వనపర్తి జిల్లాలో అధికంగా చెరుకు పంటలకు నిప్పంటుకున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి.

సలేశ్వరం.. నిరంతరం

ఇకపై ఎల్లప్పుడూ లింగమయ్య దర్శనానికి అటవీశాఖ యోచన



సలేశ్వర లింగమయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు (ఫైల్)

- పరిమిత సంఖ్యలో టూరిజం ప్యాకేజీలకు రూపకల్పన
- ఇప్పటికే ఆమోదం తెలిపిన ఆలయ కమిటీ
- ఏకాభిప్రాయంతోనే నిర్వహణకు అవకాశం
- అనుమతి వస్తే 8 నెలలపాటు సాహసయాత్ర

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ అమరనాథ్ యాత్రగా పేరొందిన నల్లమలలోని సలేశ్వర లింగమయ్య యాత్రను ఇకపై నిత్యం భక్తులకు అందుబాటులో ఉంచేందుకు అటవీశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. అటు పర్యావరణానికి, ఇటు వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రూపొందించే ఈ ప్రత్యేక పర్యాటక ప్యాకేజీకి ఉన్నతాధికారులు అనుమతి ఇస్తే సుమారు నెలల తరబడి భక్తులు నల్లమలలో సాహసయాత్ర చేపట్టేందుకు ఆస్కారం దక్కనుంది. స్థానికంగా ఉండే చెంచులకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ఆదాయాన్ని పెంచేందుకు అటవీ శాఖ వివిధ కార్యక్రమాలను అమలుపరుస్తోంది. ఇందులో భాగంగానే సలేశ్వర లింగమయ్య దర్శనానికి టూరిజం ప్యాకేజీల ద్వారా అవకాశం కల్పించడంపై అటవీశాఖ దృష్టి పెట్టింది.

ఆలయ కమిటీ ఆమోదం..

చెంచుల ఆరాధ్యదైవంగా నల్లమలలో కొలువుదీరిన సలేశ్వరం లింగమయ్య దర్శనానికి సుదీర్ఘకాలం పాటు అవకాశం కల్పించేందుకు స్థానిక ఆలయ కమిటీ నుంచి ఆమోదం లభించినట్టు సమాచారం. ఈ యాత్ర చేపట్టే ఔత్సాహిక టూరిస్టుల నుంచి టికెట్ రూపంలో వచ్చే ఆదాయాన్ని ఆలయ కమిటీతోపాటు స్థానిక చెంచులకు అందేలా చర్యలు ఉంటాయని అటవీ శాఖ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై ఇప్పటికే అటవీశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. వారి నుంచి అనుమతి రాగానే ఈ ఏడాదిలో భక్తులకు లింగమయ్య దర్శనభాగ్యం కల్పించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

ప్రత్యేక ప్యాకేజీలు..

అడవిలోని వన్యప్రాణులకు మానవ సంచారంతో ఇబ్బంది లేకుండా పరిమిత సంఖ్యలోనే టూరిస్టులను లోపలికి అనుమతించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే జంగిల్ సఫారీ, టైగర్ స్టే పేరుతో అటవీ శాఖ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుండగా.. సలేశ్వర యాత్ర సైతం అమల్లోకి రానుంది. నల్లమలలో వన్యప్రాణుల కదలికలకు ఆటంకం లేకుండా నిత్యం సుమారు 60 మంది లోపు టూరిస్టులను మాత్రమే అనుమతించనున్నారు. ఎకో టూరిజం ప్యాకేజీల్లో భాగంగా వైల్డ్ లైఫ్, సఫారీ, టూరిజం, ట్రెక్కింగ్, సలేశ్వరం లింగమయ్య వరకు సాహస యాత్ర చేపట్టేలా ప్యాకేజీలను రూపొందించనున్నారు. వీటిలో స్థానిక చెంచులకు ఉపాధి, వారి ఆధ్వర్యంలో నిర్వహించే సలేశ్వర లింగమయ్య ఆలయ కమిటీకి ఆదాయం లభించేలా కార్యాచరణ ఉండనుంది.

8 నెలలపాటు దర్శనభాగ్యం..

నల్లమల లోతట్టు ప్రాంతంలో ఎత్తైన కొండలు, లోయల మధ్యనున్న లింగమయ్యను దర్శించుకోవాలంటే భక్తులు పెద్ద సాహసమే చేయాలి. లింగమయ్య సన్నిధిలో ఎత్తైన కొండ నుంచి జాలువారే సలేశ్వర తీర్థం జలపాతం.. అక్కడిదాకా చేరేందుకు పడిన శ్రమను మైమరిపించేలా చేస్తుంది. ప్రతిఏటా ఉగాది తర్వాత వచ్చే చైత్రశుద్ధ పౌర్ణమి సందర్భంగా చెంచులు లింగమయ్యకు ఉత్సవాలు నిర్వహిస్తారు. గతంలో వారం రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహించగా.. కరోనా వ్యాప్తి తర్వాత అటవీశాఖ మూడు రోజులకే పరిమితం చేసింది. ఏడాదిలో కేవలం మూడు రోజుల పాటే లింగమయ్య దర్శనం ఉండటంతో లక్షల సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. ఇరుకైన లోయల మధ్య ప్రయాణం, దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షణ నేపథ్యంలో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా ముగ్గురు భక్తులు మరణించగా.. గత ఎనిమిదేళ్లలో తొమ్మిది మంది మృతిచెందారు. దట్టమైన అటవీప్రాంతం కావడంతో అంత పెద్ద సంఖ్యలో హాజరవుతున్న భక్తులకు ఎలాంటి సౌకర్యాలు ఉండవు. దీంతో జనాలను నియంత్రించడంతోపాటు వన్యప్రాణులకు నష్టం కలగకుండా ఎకో టూరిజం ప్యాకేజీలను అమలుచేసేందుకు అటవీశాఖ సిద్ధమవుతోంది. అడవిలోని వన్యప్రాణుల సంతానోత్పత్తికి వర్షాకాలం ప్రారంభమయ్యాక జూలై నుంచి అక్టోబర్ చివరి వరకు అనువైన కాలం. ఈ సమయంలో మినహాయించి మిగతా కాలంలో ఈ ప్యాకేజీని అమలుచేసే యోచనలో అటవీశాఖ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రతిపాదనలు పంపాం..



నల్లమలలోని వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా సలేశ్వరం లింగమయ్య దర్శనానికి అవకాశం కల్పించేందుకు అటవీ శాఖ ప్రయత్నాలు మొదలుపెట్టింది. స్థానిక చెంచుల సహకారంతో వైల్డ్‌లైఫ్ సఫారీ, ఎకో టూరిజంతోపాటు సలేశ్వరం వరకు ట్రెక్కింగ్, దర్శనం వంటి ప్యాకేజీలను రూపొందించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక అమలుచేస్తాం.

– రోహిత్, జిల్లా అటవీశాఖ అధికారి

సాఫీగా ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ తదితరులు

జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి: త్వరలో ప్రారంభంకానున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు వరి ధాన్యం శుభ్రతపై అవగాహన కల్పించాలని.. దిగుబడులు నాణ్యతగా ఉండాలంటే రైతులు పంట మార్పిడి పద్ధతిని పాటించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ధరల పట్టిక ఫ్లెక్సీలను ప్రదర్శించాలని, తేమశాతాన్ని స్పష్టంగా వివరించాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద క్లీనింగ్ మిషన్, తేమశాతం కొలిచే పరికరాలు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచాలని, రైతులకు జారీచేసిన టోకెన్ల ప్రకారం కేంద్రానికి ధాన్యం తీసుకురావాలని, తప్పనిసరిగా రైతుల ఆధార్ నంబర్ నమోదు చేయాలన్నారు. ఎఫ్‌టీఓ జనరేషన్ 48 గంటల్లో పూర్తికావాలని, అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. బుధవారం నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా 259 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 40 లక్షల గన్నీ బ్యాగులు ఉన్నాయని.. మిగతావి తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మాట్లాడుతూ.. రైస్‌మిల్లర్లు రైతులకు సహకరించాలని, రవాణా విషయంలో రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలోనూ వరి ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశారని అధికారులను ప్రశంసించారు. వర్షం వస్తే తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశంలో డీఎస్‌ఓ సుదర్శన్, డీఎం కొండల్‌రావు, డీఏఓ సుధాకర్‌రెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, మార్కెటింగ్‌శాఖ డీఎం స్వరణ్‌సింగ్, డీసీఓ కాశీక్రాంతి, నాగవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది, సొసైటీ అధ్యక్షులు

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

వనపర్తి: రాజకీయ దురుద్దేశంతోనే దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని మంత్రి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు నాయకులు లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పురుషోత్తంరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాన్‌గల్ మండలంలోని భూములు 2014, 2018 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నవేనని, ఆ వ్యవసాయ క్షేత్రం మంత్రి సతీమణి సొంత డబ్బులతో కొనుగోలు చేసి బ్యాంకు లోన్‌తో ఇంటి నిర్మాణం చేపట్టారని వివరించారు. ఆయన కుమార్తెలు ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ సంపాదించిన డబ్బుతో చందూరులో చట్టబద్ధంగా కొనుగోలు చేసినవేనని తెలిపారు. కొన్ని భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి విదేశాల నుంచి రాలేని పరిస్థితులు కరోనా కాలంలో చిన్ననాటి నుంచి మంత్రి ఇంట్లో పెరిగిన గొడనాయక్ పేరున కొంత రిజిస్టర్ చేసి తర్వాత తన పిల్లల పేరున మార్చుకున్నారని వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పెద్దమందడి మండలం మోజర్లలో 50 ఎకరాల భూమి ఉన్నట్లు చేసిన ఆరోపణలు సత్యదూరమని.. లండన్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న మంత్రి సొంత మరదలు కవిత, వారి స్నేహితుల భూమి కేవలం 11.20 ఎకరాలు మాత్రమేనని తెలిపారు. ఆరోపణలు చేసిన మూడుబోట్ల దుబ్బాక ఎమ్మెల్యే నచ్చిన సర్వేయర్‌తో సర్వే చేయించుకోవచ్చని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనను ఈ భూములకు ముడిపెట్టడం సరికాదన్నారు. చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి

కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: మైనార్టీల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాముయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలోని మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని, గొప్ప మనుసున్న నాయకుడని కొనియాడారు. మైనార్టీల పిల్లలు చదువుకొని ఉన్నతస్థాయిలో ఉండాలని ప్రత్యేకంగా మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేశారన్నారు. రంజాన్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, అందరికి అల్లా దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటయ్యయాదవ్, నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

నేడు డయల్ యువర్ డీఎం

వనపర్తిటౌన్: ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 వరకు సెల్‌ఫోన్ నంబర్ 99592 26289కు ఫోన్‌చేసి వివరించాలని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ అభివృద్ధికి పాటు పడాలని పేర్కొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని.. ముస్లిం మైనార్టీలను అన్నివిధాలుగా ఆదుకుంటూ అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఈద్గా వద్ద మరమ్మతు పనులకు భూమిపూజ, తహసీల్దార్ కార్యాలయం వద్ద షాదీముబారక్ చెక్కులతో పాటు రంజాన్ తోఫాలను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ముస్లిం యువతుల వివాహాలకు షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి రంజాన్‌కు కానుకలు అందిస్తూ పేద ముస్లింల ఇళ్లల్లో పండుగ సంతోషాన్ని చూడాలన్నది సీఎం కేసీఆర్ ఉద్దేశమన్నారు. అంతేగాకుండా ఉపవాస దీక్షాపరులకు ప్రభుత్వ తరుపున ఇఫ్తార్‌విందు ఇస్తున్నట్లు తెలిపారు. మసీదుతో పాటు ఈద్గా అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. రంజాన్ పండుగను ప్రతి ముస్లిం సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, బీఆర్‌ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, అక్కల నర్సింహులుగౌడ్, జింక రవి, షానవాజ్‌ఖాన్, రఫీయొద్దీన్, బాలరాజు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందు..

పట్టణంలోని జామియా మసీదులో మంగళవారం ఉపవాస దీక్షాపరులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఉపవాస దీక్షాపరులతో కలిసి ప్రార్థన చేసి అనంతరం విందు చేశారు.



అమరచింతలో ఈద్గా మరమ్మతుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

ఆటో ట్యాంకర్ ఢీకొని.. చిన్నారి మృతి


వర్షిణి (ఫైల్)

కొత్తకోట: గ్రామ పంచాయతీ ద్వారా ఫిల్టర్ వాటర్ సరఫరా చేసే ఆటో ఢీకొని ఓ చిన్నారి మృతిచెందింది. ఈ సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని పాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కురుమూర్తి, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారిలో చిన్న కుమార్తె వర్షిణి(3) ఇంటి సమీపంలో గోడ పక్కన నీడకు కూర్చొని ఆడుకుంటోంది. అయితే గ్రామంలో ఫిల్టర్ నీళ్ల సరఫరా చేసేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో ఓ ఆటోను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆటోడ్రైవర్ హరికృష్ణ అజాగ్రత్తగా ఆటో నడుపుతూ చిన్నారి వర్షిణిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు.

బాలిక అదృశ్యం

గోపాల్‌పేట: మైనర్ బాలిక అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏదులకు చెందిన ఓ మైనర్ బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదివి ఇంటి దగ్గరే ఉంటోంది. ఈనెల 8న తల్లి బట్టలు ఉతికేందుకు వెళ్లగా, బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గోవర్ధనగిరిలో కౌలు రైతు ఆత్మహత్య

పాన్‌గల్: వీపనగండ్ల మండలం గోవర్ధనగిరిలో సోమవారం రాత్రి గులికల మందు తాగి కౌలు రైతు పిట్టల రమేష్(42) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రమేష్ గ్రామంలో కొందరి రైతుల వద్ద మామిడి తోటలకు కౌలుకు తీసుకున్నాడు. ఈ ఏడాది మామిడి పంట పూర్తిగా రాకపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి ఉండడంతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన రమేష్ సోమవారం రాత్రి తన ఇంటి వద్ద గుళికల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనారోగ్యంతో ఇటీవలలాయన భార్య మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలు ఉండగా.. ఒక కుమార్తెకు వివాహం చేశాడని, మరో కుమార్తె ఇంటివద్దే ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వీఆర్ఏ మృతి

మహమ్మదాబాద్: మద్యానికి, కల్లుకు బానిసగా మారి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వీఆర్ఏ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గండేడ్ మండల పరిధిలోని రెడ్డిపల్లికి చెందిన వీఆర్ఏ కృష్ణయ్య (50) గ్రామంలో వీఆర్ఏగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిన మారిన ఆయన తాగిన మైకంలో ఈ నెల 15వ తేదీ పురుగు మందు తాగాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు పేర్కొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి బలవన్మరణం

బాలానగర్: మండల పరిధిలోని మోతీఘణపూర్‌లో చంద్రయ్య(66) పెద్ద చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతకాలంగా మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ సభ్యులతో చిన్నపాటి మనస్పర్ధలతో చంద్రయ్య(66) ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలియజేశారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు. వారం రోజుల కిందట ఇదే గ్రామంలోని పెద్ద చెరువులో పడి మరో మహిళ సైతం ఆత్మహత్యకు పాల్పడగా.. గ్రామంలో చంద్రయ్య మృతి చర్చనీయాంశంగా మారింది.

అచ్చంపేటలో మరో వృద్ధుడు..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాంనగర్ కాలనీలో నివాసముంటున్న బొడ్డుపల్లి ఆంజనేయులు(60) ఈనెల 14న తన ఇంటిలో (టర్‌పెయింట్ ఆయిల్) ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త

- వేసవిలో చోరీలపై అప్రమత్తంగా ఉండాలి
- మూడేళ్లలో 801 కేసులు నమోదు




చోరీ జరిగిన ఇల్లు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటర్, పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో పాటు పాఠశాల విద్యార్థులకు సైతం సెలవులు ఇవ్వనున్నారు. ఈ క్రమం లో చాలామంది పట్టణాలు విడిచి, గ్రామీణ ప్రాంతాలకు వెళ్తారు. యాత్రలు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇలా వెళ్లిన వారి ఇళ్లలోనే చోరీలు జరుగుతున్నాయి. దీంతో బాధితుల అవస్థలు వర్ణనాతీతం. కష్టపడి దాచుకున్న డబ్బు, సొమ్ములు లేక జీవనం ఇబ్బందికరంగా మారి మానసికంగా కుంగిపోతారు. ఈ నేపథ్యంలోనే పోలీస్ శాఖ ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తోంది.

చోరీలు	2020లో	2021లో	2022లో
రాబరీ కేసులు	4	0	6
పగలు చోరీలు	31	21	11
రాత్రి చోరీలు	56	89	172
సాధారణ చోరీలు	118	172	205

ఏడాది	పోయిన ఆస్తి	రికవరీ చేసింది	శాతం
2020	2,00,75,194	81,18,35,950	40.76
2021	2,38,78,087	88,25,735	36.96
2022	01,98,59,934	95,78,990	48.23

గత మూడేళ్ల కాలంలో జిల్లాలో నమోదు అయిన దొంగతనం కేసులు పరిశీలిస్తే రాత్రి సమయంలో అధికంగా చోరీలు జరుగుతున్నాయి. జిల్లాలో 2020లో 211 దొంగతనం కేసులు నమోదయ్యాయి. వీటిలో 116 కేసులను పోలీసులు ఛేదించారు. 2021లో 287 కేసులు నమోదుకాగా దీంట్లో 194 కేసులను, 2022లో 303 కేసులు నమోదు కాగా 137 కేసులను ఛేదించారు. ఈ చోరీల్లో కోల్పోయిన సొమ్ములో కనీసం 50శాతం కూడా రికవరీ కాలేదు.

చోరీలు జరుగుతూనే ఉన్నాయి..

మహబూబ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు ఎక్కువయ్యాయి. పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. పలు కాలనీల్లో గస్తీని పెంచినా దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. సీసీఎస్ పోలీసులు సొమ్మును రికవరీ చేస్తూనే ఉన్నారు. చోరీలను నియంత్రించడం సాధ్యం కావడంలేదు. దొంగలు ప్రధానంగా పట్టణ శివారు కాలనీలను, జన సంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. చోరీ జరిగిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు తప్పా, ముందస్తు జాగ్రత్తలు మాత్రం తీసుకోవడం లేదు.

సెలవుల దడ

ప్రస్తుతం పోలీసుల్లోనూ సెలవుల దడ పట్టుకుంది. సెలవుల్లో చాలా మందికి తమ ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రతీ ఒక్కరి దృష్టి పండుగ వేడుకల మీద ఉంటుంది. ఇదే సమయంలో తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఈ సీజన్‌లో చాలా మేర దొంగతనాలు కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లపై దొంగలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నారు. రోజురోజుకూ నేరగాళ్ల సంఖ్య పెరుగుతుండటంతో వారిని గుర్తించడం పెద్ద తలనొప్పిగా మారింది.

గస్తీ ముమ్మరం..

సెలవుల్లో చాలా మంది వివిధ ప్రాంతాలకు, సొంత గ్రామాలకు ఎక్కువగా వెళ్లే వారి ప్రాంతాలు, కాలనీల్లో గస్తీని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంలో ఉన్న మూడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్, రక్షక్‌లతో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గస్తీ నిర్వహించాలి. మూడు పోలీస్ స్టేషన్స్ పరిధిలో రోజుకు పలుబీట్లు ఏర్పాటు చేసుకోని బందాలుగా తిరుగుతూ శాంతిభద్రతలు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ప్రజలు అత్యవసర సమయంలో 100లేదా పట్టణ పోలీస్‌స్టేషన్స్‌కు ఫోన్ చేయాలి.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

- ఎక్కువ రోజులు ఊరెళ్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.
- ప్రధాన ద్వారాలు కాకుండా ఇతర ద్వారాలు ఉంటే వాటికి తాళం వేస్తూ మిగతా వాటికీ లోపలి భాగాలకు తాళం వేయాలి.
- ఇంట్లో లేకున్నా గదుల్లో విద్యుత్ దీపాలు వేసి ఉంచాలి. దీంతో పాటు తాళం వేసి ద్వారాలకు పరదాలు, కర్టెన్లు వేస్తే కనబడకుండా ఉంటాయి.
- విలువైన ఆభరణాలు, నగదు వెంట తీసుకెళ్లాలి. లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- రాత్రిపూట ఒంటరిగా వెళ్లాల్సి వస్తే మహిళలు తక్కువగా ఆభరణాలు ధరించాలి. అవసరం అయితే భుజం పైనుంచి కొంగు కప్పుకొని వెళ్లడం శ్రేయస్కరం.
- ఊర్లో ముందు ద్విచక్ర వాహనాలు ఆరుబయట, ప్రహరీ లోపల, ఇంటి ముందు పెట్టి వెళ్లకూడదు. వాహనానికి జాగ్రత్తగా తాళం వేసి సుపరిచితుల ఇళ్లలో పెట్టిపోవడం చాలా మంచిది.
- సెలవుల్లో కుటుంబ సభ్యులు ఊరెళ్లినప్పుడు ఆభరణాలకు రంగులు, మెరుగులు అద్దుతాం అంటూ ఇళ్లకు వచ్చే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వచ్చినవారి ప్రాంతం, వారి గుర్తింపు కార్డులు పరిశీలన చేయాలి.
- మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉంటే ఇల్లు, గదులు అద్దె కోసం వచ్చినవారికి లేవని చెప్పడమే మంచిది.
- అనుమానాస్పద వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తుంటే 100కు లేదా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వడం మంచిది.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం..

వేసవిలో స్వగ్రామాలకు, ఇతర విహార యాత్రకు వెళ్లేవారు ఇంట్లో విలువైన ఆభరణాలు, డబ్బులు పెట్టరాదు. ఇంట్లో సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ ఏర్పాటు చేసుకోవాలి. ఇంటికి సెంట్రల్ లాక్‌సిస్టమ్ తాళం ఏర్పాటు చేసుకోవాలి. పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవాలి. ద్విచక్ర వాహనాలకు తాళం వేసి ఇంటి ఆవరణలో పార్క్ చేసుకోవాలి. ఎలాంటి పరిస్థితిలో గుర్తు తెలియని వ్యక్తులను ఇంట్లో పనికి పెట్టుకోవద్దు. ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో గమనిస్తుండాలి. మెయిన్ డోరుకు తాళం వేసినా కనిపించకుండా కర్టెన్స్ వేయాలి. ఇంట్లో, బయట లైట్లు ఆన్ చేసి ఉంచాలి. – కె.నరసింహ, ఎస్పీ, మహబూబ్‌నగర్

అడవిపంది దాడిలో గొర్రెల కాపరి మృతి


మృతిచెందిన చినవెంకటస్వామి

పెద్దకొత్తపల్లి: అడవి పంది దాడిలో గొర్రెల కాపరి చినవెంకటస్వామి(51) మంగళవారం రాత్రి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. పెద్దకొత్తపల్లి మండలం వావిళ్లబావిలో చినవెంకటస్వామి రోజులాగే మంగళవారం గొర్రెలను మేపుకొని చీకటిపడ్డాక గ్రామసమీపంలోని మంద వద్దకు చేరుకున్నాడు. గొర్రెపిల్లలకు పాలు పట్టిస్తుండగా.. కేఎల్ఐ కాల్వ నుంచి ఓ అడవిపంది వచ్చి చినవెంకటస్వామిపై దాడి చేయడంతో..తీవ్రంగా గాయపడ్డాడు. తోటి గొర్రెల కాపరులు వెంకటస్వామిని కాపాడేందుకు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ఆస్పత్రికి వచ్చేలోపే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. మృతుడికి భార్య అలివేల, కుమారుడు ఉన్నారు.

తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యం


పిల్లలతో మంజుల

నవాబుపేట: మండల పరిధిలోని కూచూర్ గ్రామంలో తల్లితో పాటు ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిట్టల మంజుల తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైందని ఆమె భర్త లింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన వివరాలు పోలీసుల సమాచారం ప్రకారం ఇలా ఉన్నాయి. కూచూర్‌కు చెందిన లింగంకు అదే గ్రామానికి చెందిన పిట్టల మంజులతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి సాయిచైతన్య(8), పల్లవి(6) సంతానం ఉన్నారు. లింగం ఎప్పటి మాదిరిగా పోలేపల్లి కంపెనీలో పనికి ఈనెల 16వ తేదీన ఆదివారం వెళ్లాడు. తిరిగి 17వ తేదీన సోమవారం ఉదయం ఇంటికి వచ్చాడు. ఇంట్లో భార్యా, పిల్లలు కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల చెంత వెతికినా ఆచూకీ లేకపోవటంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడేళ్ల క్రితం ఒకసారి మంజుల తన పిల్లలను ఇంట్లో వదిలి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఏడాది తర్వాత తిరిగి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పిల్లలతో కలసి తల్లి..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సంజీవయ్యకాలనికి చెందిన అలివేల తన ఇద్దరు కుమారులతో కలసి ఈనెల 16నుంచి కనిపించటం లేదని భర్త సురేష్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని సీఐ రమేష్‌బాబు తెలిపారు. పదేళ్లక్రితం తనకు వివాహం అయ్యిందని, డిగ్రీ కళాశాలలో పనిచేసే తాను ఎప్పటిలాగే ఈనెల 16న సాయంత్రం 7గంటలకు ఇంటికిరాగా భార్య, ఇద్దరు కుమారులు కనిపించలేదని తెలిపారు. తెలిసినవాళ్ల వద్ద, బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంబేడ్కర్ గొప్ప మానవతావాది

పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్


సినీఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు డా.దరువుఎల్లన్నకు జ్ఞాపికను అందజేస్తున్న లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డా.బీఆర్ అంబేడ్కర్ గొప్ప మానవతావాది అని పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీలోని అకాడమిక్ ఆడిటోరియంలో అంబేడ్కర్, జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని సూచించారు. అస్పృశ్యతను తుడిచిపెట్టడానికి చట్టాన్ని రూపొందించి అవసరమైన వాతావరణాన్ని సృష్టించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. సినీఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు డా. దరువు ఎల్లన్న మాట్లాడుతూ కుల, మత, లింగ అసమానతలు తొలగినప్పుడే నవ సమాజం నిర్మితమవుతుందన్నారు. అది విశ్వవిద్యాలయాల నుంచే ప్రారంభం కావాలన్నారు. మహనీయుల త్యాగ ఫలితాలే అభివృద్ధికి సోపానమైందన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ ప్రొ.కె.గిరిజా మంగతాయారు, వీసీ ఓఎస్‌డీ డా.మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ డా.ఎన్.కుమారస్వామి, కో–కన్వీనర్ డా.కె.ప్రవీణ, ఎస్సీ, ఎస్టీ సెల్ మాజీ డైరెక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కంటికి చలువ సుర్మా

- అందంతోపాటు ఆరోగ్యానికి మేలు
- సంప్రదాయంగా భావిస్తున్న ముస్లింలు
- రంజాన్‌లో తప్పనిసరిగా వినియోగం


వివిధ రకాల సుర్మాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: సుర్మా.. కళ్లకు చలువనివ్వడంతో పాటు తేజస్సును ఇస్తోంది. సాధారణ రోజుల్లో దీన్ని గురించి ఆలోచించకపోయినా పవిత్ర రంజాన్ మాసంలో తప్పకుండా ముస్లింలు కళ్లకు సుర్మా పెట్టుకుంటారు. ఆనాడు ప్రవక్త మూసా అలైహిసలాం సుర్మాను వాడారు. గల్ఫ్‌లోని మరాఖిష్ ప్రాంతంలో కోహెతూర్ పర్వతం అప్పట్లో భస్మీపటలమైంది. ఆ పర్వతం నుంచి వచ్చే నల్లరాయి పౌడర్‌నే మూసా ప్రవక్త మొదటిసారి సుర్మాగా వినియోగించినట్లు ముస్లిం పెద్దలు చెబుతారు. అప్పటి నుంచి మహ్మద్ ప్రవక్త వరకు ఈ సుర్మాను వాడారని తెలియజేస్తున్నారు. ముస్లింలు భక్తితో ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలో ఉండి సుర్మా ఎక్కువగా వినియోగిస్తారు.

చలువు కోసం...

రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండటంతో కళ్లకు వేడి కలుగకుండా ఉండేందుకు సుర్మాను పెట్టుకుంటారు. ఇది నల్లగా ఉండటంతో కంటికి అందంగా కనిపిస్తోంది. కంటిలోని మలినాలు బయటకు వెళ్లడంతో పాటు కంటి సంబంధ వ్యాధులు రావని వైద్యులు చెబుతున్నారు.

జిల్లా కేంద్రంలో...

జిల్లా కేంద్రంలోని మదీనా మసీద్, క్లాక్‌టవర్, న్యూటౌన్, వన్‌టౌన్ ప్రాంతాల్లో సుర్మాను విక్రయిస్తున్నారు. కోహెతూర్ సుర్మా, కోజాతి సుర్మా, కోహులుల్ జవాహెర్ తదితర రకాల సుర్మాలను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. నాణ్యతను బట్టీ సుర్మా రూ.50 నుంచి రూ.1,400ల ధర ఉంటుంది.

మైసమ్మ ఆలయ చైర్మన్‌గా కృష్ణయ్య



నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్వతాపూర్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన కృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉత్తర్వులు వెలువడినట్లు ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. చైర్మన్‌తో పాటు మరో 13 మందిని ఆలయ కమిటీ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చైర్మన్ కృష్ణయ్యతో పాటు సభ్యులుగా కాకర్లపహాడ్‌కు చెందిన దండు రాములు, కొండానాయక్, వెంకటేష్, నర్సింహులు, ఆంజనేయులు, యాదయ్య, జి.శ్రీనివాస్, మురుగని మాధవులు, తలారి మొగులయ్య, రాజేందర్, శేరి అనిత, గోవిందమ్మ, వీరాచారిలను సభ్యులుగా నియమించారు. వారం రోజుల్లో నూతన ఆలయ పాలకవర్గం కొలువు తీరనుంది.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం


రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: శ్రీశైల మహాక్షేత్రానికి పశ్చిమ ద్వార క్షేత్రమైన అలంపురం బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలోని నంది మండపంలోని యాగశాలలో మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ఘనంగా రుద్ర హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణమూర్తి శర్మ, పృథ్వీనాథ్ శర్మ రుద్ర హోమాన్ని చేపట్టారు. రుద్రహోమాలు చేయడం ద్వారా ఆలయానికి జనాకర్షణ, ధనాకర్షణ, రూపాకర్షణ కలుగుతాయని తెలిపారు. భక్తులు ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రతి మాస శివరాత్రి రోజు రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పురంధర్‌కుమార్ తెలిపారు.

జూలెకల్‌లో మొక్కజొన్న పంట దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- కాలిబూడిదైన ఐదెకరాలు
- రూ.4 లక్షల వరకు పంట నష్టపోయామని రైతుల ఆవేదన


జూలెకల్ శివారులో అగ్నిప్రమాదంలో కాలిపోయిన మొక్కజొన్న పంట

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామ శివారులోని పంటపొలాల్లో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ రైతులు చిన్న ఆంజనేయులు, ఉజూరు, దుబ్బన్న, కమ్మరి కేశవులు, కురువ నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొక్కజొన్న పంటకు నిప్పంటుకుందని సమీపంలోని రైతులు సమాచారం అందించగా హుటాహుటిన పొలాలకు వెళ్లామన్నారు. మంటలను అదుపు చేసేందుకు బోరు బావుల్లోని నీటితో ప్రయత్నించగా గాలికి సెగలు ఎక్కువ అవడంతో ఐదెకరాలు కాపాడలేకపోయామన్నారు. సమీపంలో మరో 8 ఎకరాలు ఉండగా.. రైతులందరి కృషితో మంటలను అదుపు చేశామన్నారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా.. ఫైర్ ఇంజిన్ వచ్చేలోపు ఐదు ఎకరాల్లోని పంట అగ్నికి ఆహుతయ్యిందన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట కళ్ల ఎదుటే కాలి బూడిదయ్యిందని రైతులు విలపించారు. రూ.4 లక్షల వరకు పంట నష్టపోయినట్లు రైతులు వాపోయారు. ఫైర్ ఇంజిన్ వచ్చిన అనంతరం అక్కడక్కడ ఉన్న మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులను తోటి రైతులు కోరారు. సోమవారం మండల పరిధిలోని తనగలలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని పదెకరాల్లో పంట కాలిపోవడం, మంగళవారం జూలెకల్‌లో మరో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక సమీపంలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో గద్వాల నుంచి వచ్చేలోపు ఆస్తినష్టం బాగా జరుగుతోందని, సమీపంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసి ఆస్తినష్టం వాటిల్లకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

సాయంత్రం మరో రెండెకరాల్లో..

ఉదయం ఐదెకరాల్లోని పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతుండగా.. సాయంత్రం మరో గ్రామ శివారులో మరోచోట అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన డీలర్ ఆంజనేయులుకు చెందిన ఎకరం, గుడ్డెన్నకు చెందిన ఎకరం పొలంలోని మొక్కజొన్న పంటకు నిప్పంటుకుని కాలిబూడిదైంది. దీంతో మొక్కజొన్న పంటలు, కోత కోయని రైతుల ఎప్పుడు ఎవరి పొలంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని పంట పొలాల్లోని రైతులు వారి పొలాల్లో చెత్తకు నిప్పంటించడం, బీడీ, సిగరెట్ తాగి ఆర్పకుండా అలాగే పారవేయడంతో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి అగ్నిప్రమాదాలు చేటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తారాపురంలో భూ వివాదం

- దిమ్మెలు తొలగించిన మహిళలు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్


దిమ్మెను తొలగిస్తున్న మహిళలు


అగ్రిమెంట్ పేపర్

గట్టు: గ్రామం కోసం కేటాయించి, ఒప్పందం చేసుకున్న భూమిని 9 నెలల తర్వాత ఇవ్వడం కుదరదని చెబుతూ, దిమ్మెలను పాతడానికి వచ్చిన వ్యక్తులను తారాపురం గ్రామస్తులు అడ్డుకున్నారు. వాగ్వాదానికి దిగి, ఆ దిమ్మెలను తొలగించిచారు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ భూ వివాదానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తారాపురం శివారులో ముల్లమాన్యంకు చెందిన 27 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూముల యజమానులు సుమారుగా పదేళ్ల క్రితమే ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అయితే ప్రస్తుతం భూములకు మంచి ధర పలుకుతున్న క్రమంలో భూ యజమానులు వాటిని విక్రయించేందుకు సిద్ధం అయ్యారు. ఏడాది క్రితం ముల్లమాన్యం భూములను భూ యజమానులు గద్వాల ప్రాంతానికి చెందిన ఓ ముస్లింకు విక్రయించేందుకు సిద్ధం అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఈ భూమిని విక్రయించడానికి వీలు లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి గత ఏడాది ఆగస్టులో తారాపురం గ్రామస్తులతో ఓ ఒప్పందం చేసుకుని, అగ్రిమెంట్ రాసుకున్నారు. ముల్లమాన్యంకు సంబంధించి సర్వే నెంబర్ 216లో 4–20 ఎకరాలను గ్రామ అవసరాలు, మసీదు నిర్మాణం, ముల్లతనం చేసే వ్యక్తిని ఇచ్చేందుకు అంగీకరిస్తూ, గ్రామస్తులతో కలసి బాండ్ పేపర్‌పై అగ్రిమెంట్ రాసుకున్నారు. 9నెలల తర్వాత ఒప్పందం మేరకు 4–20 ఎకరాలను ఇవ్వడానికి నిరాకరిస్తూ, మొత్తం భూమి చుట్టూ సిమెంట్ దిమ్మెలను పాతడానికి ప్రయత్నించగా, గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. వారిని వెనక్కి పంపారు. ఈ సందర్భంగా దిమ్మెలను మహిళలు తొలగించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

క్లుప్తంగా...

విప్లవోద్యమం సజీవంగా ఉంటుంది

సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న

సిరిసిల్ల/చంచల్‌గూడ: తెలంగాణలో ప్రస్తుతం విప్లవోద్యమం బలహీనపడినా.. అది నిరంతరం సజీవంగానే ఉంటుందని, అది మళ్లీ ఎగసిపడుతుందని సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ అన్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించే రాజ్యం తమను వెంటాడుతోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఓ హత్య కేసులో అరెస్టయిన రాజన్న కొన్ని నెలలుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం ఆయన సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ.. దిద్దుబాటు కేంద్రాలుగా ఉండాల్సిన జైలులో మానహక్కుల హననం జరుగుతోందన్నారు. అండర్ ట్రయల్‌లో ఉన్న వారికి అనారోగ్య సమస్యలు వస్తే, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో రాజన్న సోదరుడు కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క తదితరులు పాల్గొన్నారు. కాగా, సుద్దాల మాజీ సర్పంచ్ ఏనుగు వేణుగోపాల్‌రావు అలియాస్ ప్రభాకర్‌రావు హత్య కేసులో నిందితుడిగా ఉన్న విశ్వనాథ్‌కు బెయిల్ ఇచ్చేందుకు జిల్లా కోర్టు నిరాకరించింది. దీంతో ఆయనను సిరిసిల్ల నుంచి మళ్లీ జైలుకు తీసుకెళ్లారు.

నకిలీ బిల్లులపై విచారణ

ఖమ్మం వినాయక ఆస్పత్రిలో తనిఖీ

ఖమ్మం వైద్యవిభాగం: సీఎం సహాయనిధి నుంచి పరిహారం పొందేందుకు వైద్యం చేయకుండానే.. చేసినట్లు తప్పుడు బిల్లులు ఇచ్చారనే ఆరోపణలతో ఖమ్మంలోని శ్రీ వినాయక సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో హైదరాబాద్ పోలీసులు తనిఖీలు చేట్టారు. సచివాలయం ఉద్యోగి డీఎస్ఎన్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఆస్పత్రి నిర్వాహకులతోపాటు బిల్లులు సమర్పించిన శివపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సీసీఎస్ సీఐ మల్లికార్జున్ ఆధ్వర్యాన పోలీసులతోపాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంబాబు తనిఖీలు చేపట్టారు. నల్లగొండ జిల్లా చలకుర్తికి చెందిన రమావత్ శివ ఈ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,55,854 బిల్లు తీసుకున్నాడు. ఆయన వినాయక ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్ రమేష్ వద్ద వైద్యం చేయించుకున్నట్లు బిల్లుల్లో ఉంది. అయితే, అలాంటి వైద్యుడెవరూ తమ వద్ద లేరని నిర్వాహకులు చెప్పడంతో పోలీసులు రికార్డులు తనిఖీ చేశారు.

బంగారు ఇళ్లు ఎక్కడ?

గ్రామాల్లో నాకన్నీ గుడిసెలే కన్పిస్తున్నాయి: సీఎల్పీ నేత భట్టి ఎద్దేవా

- ఒక్క కేసీఆర్ కుటుంబమే బంగారుమయం అయ్యిందని విమర్శ

సాక్షి, పెద్దపల్లి: 'నేను పాదయాత్రలో ప్రతి గ్రామం చూస్తున్నా. ఏ ఒక్క ఇల్లు కూడా బంగారంలా కనిపించడం లేదు. అన్నీ గుడిసెలే కనిపిస్తున్నాయి. మరి సీఎం కేసీఆర్ చెబుతున్న బంగారు ఇళ్లు ఎక్కడున్నాయి? కేసీఆర్ తెలంగాణను బంగారం చేస్తే పేదలు ఇంకా గుడిసెల్లోనే ఎందుకు బతుకుతున్నారు? రాష్ట్రంలో నాలుగు కోట్ల ప్రజలకు చెందాల్సిన సంపదను నలుగురే దోపిడీ చేస్తున్నారు. కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయమైంది. ఆయన తన ఇల్లు చూసుకుని రాష్ట్రంలో ప్రతి ఇల్లూ ఇలాగే ఉందని అనుకుంటున్నట్టుంది..'అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం, పెద్దపల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.

■ రైతులు ఇబ్బందులు పడుతుంటే ఏం చేస్తున్నారు?

ధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని భట్టి ప్రశ్నించారు. రూ.1.25 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరంతో ఉపయోగం ఏంటో సర్కారు సమాధానం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకుండా జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి శివారులో కాలుష్య కారకమైన ఇథనాల్ కంపెనీ ఏర్పాటును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

■ ఇంకా రేకుల షెడ్లలోనే చదువులు..

రూ.2.90 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో విద్యార్థులు ఇంకా రేకుల షెడ్లలో చదవడం ఏంటంటూ.. ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల దుస్థితిపై భట్టి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'మన ఊరు మనబడి'పథకం గొప్పగా తీసుకొచ్చామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం పాఠశాలల తరగతి గదుల నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖమంత్రి జిల్లాల్లో పర్యటించి వాస్తవ విషయాలు తెలుసుకుంటే బాగుంటుందని సూచించారు. ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయడానికి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని భట్టి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు, డీసీసీ అధ్యక్షులు మక్కాన్‌సింగ్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేతల బల ప్రదర్శన

భట్టి పాదయాత్ర పెద్దపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశించే పాలితం వద్ద కాంగ్రెస్ నేతలు బలప్రదర్శనకు దిగారు. మొదట విజయ రమణారావు ఆయనకు ఘన స్వాగతం పలకగా, అనంతరం ఓదెల జెడ్పీటీసీ గంట రాములు తన అనుచరులతో కలిసి స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా తోపులాట చోటు చేసుకోవడంతో భట్టి జోక్యం చేసుకుని వారిని శాంతింపజేశారు.



భట్టి ముందే గొడవకు దిగుతున్న నాయకులు

25న బీఆర్ఎస్ జెండా పండుగ

- 19వేల జనావాసాల్లో ఎగురవేయాలి
- అదే రోజు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ ప్రతినిధుల సభలు
- పార్టీ పనితీరుపై ఆ సభల్లో చర్చించుకోవాలి: మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి, ప్రభుత్వపరంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ పనితీరుపై ఈ నెల 25న జరిగే నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభల్లో చర్చించుకోవాలని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభలు పార్టీ నియమించిన ఇన్‌చార్జీలు, స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన కొనసాగుతాయని, వాటి నిర్వహణను పార్టీ జిల్లా అధ్యక్షులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో నిర్వహించే కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో కేటీఆర్ మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 25న రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల జనావాసాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని, అన్ని నియోజకవర్గాల్లో గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం పూట పండుగ వాతావరణంలో పార్టీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు స్థాయిలో జెండా పండుగ ముగిసిన తర్వాత ఉదయం 10 గంటలకు నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని ప్రతినిధుల సభకు హాజరుకావాలన్నారు.

సమ్మేళనాల నివేదిక ఎప్పటికప్పుడు కేసీఆర్‌కు చేరుతోంది

ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమాల అమలు కమిటీ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ తీరుతెన్నులపై పార్టీ అధ్యక్షుడు, సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు ఎప్పటికప్పుడు నివేదికలు అందిస్తోందని కేటీఆర్ వెల్లడించారు. కాగా, ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసిన నేతలను కేటీ రామారావు ఈ సందర్భంగా అభినందించారు.

కనీసం 3 వేల మందితో ప్రతినిధుల సభ

కనీసం 3 వేల నుంచి 3500 మంది ప్రతినిధులతో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో సభ నిర్వహించాలని పార్టీ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలకు సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు తీసుకోవాలనీ, సమావేశాలకు హాజరయ్యే పార్టీ ప్రతినిధులకు భోజనాలు, ఇతర వసతులను సమకూర్చాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ గ్రామ, వార్డు శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీల డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు, పురపాలక సంఘాల చైర్‌పర్సన్లను ఆహ్వానించాలన్నారు. వీరితోపాటు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలను ఆదేశించారు.

అటవీభూమిలో చట్టవిరుద్ధంగా ఈద్గా నిర్మాణం

- ఆ స్థలాన్ని ఒకేషనల్ సెంటర్‌కు కేంద్రం కేటాయించిందన్న బండి సంజయ్
- చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు లేఖ



సాక్షి, హైదరాబాద్/నిర్మల్: నిర్మల్ జిల్లా చించోలి(బి) పరిధిలోని సర్వేనంబర్లు 543, 544, 969లో ఉన్న అటవీభూమిని చట్టవిరుద్ధంగా ఈద్గాకు కేటాయించి నిర్మాణం చేపట్టారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎం కేసీఆర్‌కు మంగళవారం లేఖ రాశారు. వృత్తి విద్యానైపుణ్యాల అభివృద్ధి కేంద్రం కోసం ఇవ్వాలని గతంలో రాష్ట్రప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు 3.373 హెక్టార్ల అటవీభూమిని కేంద్రప్రభుత్వం కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. అటవీభూములను సైతం డీనోటిఫై చేసిందే నిరుద్యోగుల భవిష్యత్తు కోసమని, అలాంటి భూమిని స్వార్థరాజకీయాల కోసం ఈద్గాకు కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజాఉపయోగ కార్యక్రమాల కోసం ఉపయోగించాల్సిన భూములను ప్రార్థనాస్థలాలకు కేటాయించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. కోర్టుతీర్పులకు వ్యతిరేకంగా ఈద్గాను నిర్మించడమంటే న్యాయవ్యవస్థను అవమానించినట్లేనన్నారు. ఈద్గా నిర్మాణానికి దగ్గరలోనే రెండు హిందూ ఆలయాలున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. నిరుద్యోగుల కోసం కేటాయించిన భూమిని ప్రార్థనాస్థలాలకు ఇవ్వడంతోపాటు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాజకీయ స్వార్థప్రయోజనాల కోసం యువత భవిష్యత్తును బలిచేసే చర్యలను బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వృత్తివిద్య, నైపుణ్యాల అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని అదే ప్రయోజనాల కోసం వినియోగించాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించడంతోపాటు ఆందోళనలకూ సిద్ధమవుతామని సంజయ్ హెచ్చరించారు.

నిబంధనల ప్రకారమే 'ఈద్గా'

సీఎంకు బండి సంజయ్ లేఖ రాయడాన్ని ఖండించిన మంత్రులు



ఈద్గాను ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్/సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) అటవీప్రాంతంలో నిబంధనల ప్రకారమే ఈద్గాను నిర్మించారని హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అటవీప్రాంతంలో పదెకరాల్లో రూ.5 కోట్లతో నిర్మించిన ఈద్గాను మంగళవారం సాయంత్రం మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ.. ఈద్గాపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎంకు లేఖ రాయడాన్ని ఖండించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హిందూ ముస్లింలను సమానంగా చూస్తూ గంగాజమునా తెహజీబ్‌ను కాపాడుతున్నారని తెలిపారు. అయితే.. చించోలి(బి) సమీపంలోని పదెకరాల స్థలం ఒకేషనల్ సెంటర్ కోసం ఇచ్చిందేనని, కానీ నిబంధనల ప్రకారమే ఈద్గాకు తీసుకున్నామని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. చెట్లు తీసేసినందుకు రూ.82 లక్షలు అటవీశాఖకు చెల్లించామన్నారు. ఈ స్థలానికి బదులుగా ముధోల్ నియోజకవర్గంలో అటవీశాఖకు 20 ఎకరాలు కేటాయించామని వివరించారు. ఒకేషనల్ సెంటర్ పనులనూ చేపడతామని ప్రకటించారు.

ఇది యావత్ తెలుగు విద్యార్థులపై కుట్ర

- నా యూట్యూబ్ చానల్ హ్యాక్ చేశారు
- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత



పంజగుట్ట (హైదరాబాద్): తన యూట్యూబ్ చానల్‌ను హ్యాక్ చేయడం యావత్ తెలుగు విద్యార్థులపై జరిగిన కుట్ర అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత స్పష్టం చేశారు. ఆమె మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ... గత ఆదివారం తెల్లవారుజామున తన యూట్యూబ్ చానల్ హ్యాక్ అయినట్లు గుర్తించానన్నారు. తాను రెండుసార్లు సివిల్ సర్వీసులకు ఎంపికయ్యానని, కానీ విద్యార్థులు, నిరుద్యోగులకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించానని వివరించారు. వారికి ప్రేరణ కలిగిస్తూ, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వీడియోలు చేసి అప్‌లోడ్ చేస్తున్నానని తెలిపారు. ఎంతోమంది గ్రామీణ విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు, హైదరాబాద్‌కు వచ్చి చదువుకోలేని వారికి, తెలుగులో తాను చేసిన వీడియోలు ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. తన యూట్యూబ్ చానల్‌లో ఐదు లక్షల మంది వీక్షకులున్నారని తెలిపారు. తన వీడియోలు చూసి ప్రేరణ పొందిన ఎంతోమంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. మే 25న సివిల్ సర్వీసెస్ పరీక్షలు, జూన్‌లో యూపీఎస్సీ పరీక్షలున్న నేపథ్యంలో.. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వేలాదిమంది ఫోన్ చేసి అడుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హ్యాక్ చేయడమే కాకుండా అందులో గేమింగ్ వీడియోలు పెడుతున్నారని, ఏదైనా తప్పుడు సమాచారం పెడితే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. కేసును త్వరగా పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు విద్యార్థులు నిరాశకు గురికాకుండా వారికి ప్రేరణ, పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారం ఇచ్చేందుకు 'BALA LATHA OFFICIAL'అనే కొత్త యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

గంటల్లోనే ఇసుక డంపులు మాయం



హన్వాడ: ఇబ్రహీంబాద్ శివారులో కృత్రిక ఇసుక దందా జోరుగా సాగుతోంది. గుట్టలుగా నిల్వచేసిన ఫిల్టర్ ఇసుక డంపులను పలువురు విలేకరులు మంగళవారం సందర్శించి ఫొటోలు తీసి తహసీల్దార్‌కు విషయం తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఇసుకాసురులు క్షణాల్లో అక్కడున్న ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించారు. తహసీల్దార్ బక్క శ్రీనివాసులు ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన రెవెన్యూ బృందానికి ఖాళీ అయిన ఇసుక నిల్వ ప్రాంతాలు, ఫిల్టర్ బెడ్లు దర్శనమిచ్చాయి. ఫిల్టర్ బెడ్లను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ ప్రవీణ్, ఐదుగురు వీఆర్ఏల బృందం ఉన్నారు.

ఎంపీడీఓను దూషించిన ఫీల్డ్ అసిస్టెంట్

బిజినేపల్లి: కార్యాలయంలో సోమవారం విధుల్లో ఉన్న ఎంపీడీఓ పవన్‌కుమార్‌ను శాయిన్‌పల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణతో గ్రామంలోని బిల్లుల విషయంలో చర్చ జరిగింది. ఈ క్రమంలో లక్ష్మీనారాయణ ఎంపీడీఓ పవన్‌కుమార్, అతడి కుటంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని, ఎంపీడీఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణ ఓబులరెడ్డి తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ పవన్ కుమార్‌ను వివరణ కోరగా, విధుల్లో ఉన్న తనను, తన కుటుంబ సభ్యులను అసభ్య పద జాలంతో దుర్భాషలాడి అనుచిత వ్యాఖ్యలు చేశాడని తెలిపారు.

మృత్యు శకటాలు

- ఉమ్మడి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు
- వేర్వేరు చోట్ల ఏడుగురు మృతి.. పలువురికి గాయాలు
- వనపర్తి జిల్లాలో భార్యాభర్తల దుర్మరణం
- మహబూబ్‌నగర్ సమీపంలో కర్ణాటక బస్సు ఢీకొని మరో ఇద్దరు

పొట్టకూటి కోసం వెళ్తూ కొందరు.. శుభకార్యంలో పాల్గొనేందుకు మరికొందరు.. ఇలా బయలుదేరిన వారిని రోడ్డు ప్రమాదాల రూపంలో మృత్యువు కబళించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలవగా.. మరికొందరు తీవ్రగాయాలతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిన ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

డీసీఎం ఢీకొని వ్యక్తి..



బుచ్చన్న (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బోయపల్లికి చెందిన గోద బుచ్చన్న(46) మంగళవారం మధ్యాహ్నం భూత్పూర్‌కు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో పాలకొండ బైపాస్ ఎక్స్‌రోడ్ సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్ వైపు గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుచ్చన్న అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై బుచ్చన్న కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక బస్సు, ఆటో ఢీకొని ఇద్దరు



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



రాములు (ఫైల్)



గణేష్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: కర్ణాటక ఆర్టీసీ బస్సు.. ఆటో రెండు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఆటోలో ఉన్న డ్రైవర్‌తోపాటు మరో ప్రయాణికుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. బస్సు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని రోడ్డు కిందకు దూసుకెళ్లగా.. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. ఈ ఘటనకు సంబంధించి మహబూబ్‌నగర్ రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం నుంచి ఆటో మణికొండ వైపు వెళ్తుండగా.. రాయిచూర్ వైపు నుంచి కర్ణాటక ఆర్టీసీ బస్సు మహబూబ్‌నగర్ వస్తుంది. ఈ క్రమంలో రూరల్ మండలంలోని తెలుగుగూడెం సమీపంలో రెండు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఆటో డ్రైవర్ సిద్రమోని రాములు(26), మరో ప్రయాణికుడు ఈర్ల గణేష్(19) అక్కడికక్కడే మృతిచెందారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కాలేదు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిద్రమోని రాములు, ఈర్ల గణేష్ మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చిన తర్వాత మృతుల కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో వాహనంలో ఉన్న ఇద్దరి మృతదేహాల దగ్గర కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. రాములు భార్య కృష్ణవేణి తన భర్త మృతదేహంపై పడి కన్నీటిపర్యంతమవడం అక్కడ ఉన్న వారిని కలచివేసింది. ఈర్ల గణేష్ కూలీపని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని..



శ్రీనివాస్ (ఫైల్)

బిజినేపల్లి: రాత్రి సమయంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనంతో ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పాలెం గ్రామానికి చెందిన జమ్ముల శ్రీనివాస్(50) బిజినేపల్లిలోని ఓ దాబాలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఆయన పాలెం సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొన్నాడు. శ్రీనివాస్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య చంద్రకళ, కుమారుడు, కూతురు ఉన్నారు.

శుభకార్యం కోసం వచ్చి..



కురుమూర్తి (ఫైల్)



రజిత (ఫైల్)



చిన్నారి తనుశ్రీ



ఘటనా స్థలంలో ఇలా..

వనపర్తి క్రైం: శుభకార్యంలో పాల్గొని సంతోషంగా బయలుదేరిన ఆ భార్యాభర్తలను మృత్యురూపంలో వచ్చిన పెట్రోల్ ట్యాంకర్ కబళించింది. ఈ విషాదకర ఘటనకు సంబంధించి వనపర్తి రూరల్ ఎస్ఐ చంద్రమోహన్‌రావు కథనం ప్రకారం.. కొల్లాపూర్ మండలం మంచాలకట్టకు చెందిన కురుమూర్తి(42), భార్య రజిత(32) వనపర్తిలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరికి ఒక్కగానొక్క కూతురు తనుశ్రీ ఉంది. కురుమూర్తి వనపర్తిలో కూలీలను పెట్టి పనిచేయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం భార్యాభర్తలు, కూతురు కలిసి బైక్‌పై బంధువుల శుభకార్యం కోసం నాగవరం గ్రామానికి వచ్చారు. అనంతరం సాయంత్రం గ్రామంలో ఉంటున్న రజిత తల్లి బాలీశ్వరమ్మను చూసేందుకు వెళ్తుండగా పెట్రోల్ ట్యాంకర్ ఢీకొనడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడింది. వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు మృతిచెందారనే విషయం తెలియని చిన్నారిని చూసి పలువురు కంటతడి పెట్టారు. తల్లిదండ్రులు మృతిచెంది అనాథగా మారిన చిన్నారి సంఘటన పలువురిని బాధించింది.

పర్దీపూర్ సమీపంలో మరొకరు..



అయిజ వద్ద ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన ఆటో

అయిజ: కర్నూలులోని ముజఫర్‌నగర్‌కు చెందిన కల్లెం హరి(28), కల్లెం రామారావు ఆటోలో అయిజకు వస్తుండగా.. అయిజ నుంచి కర్నూలుకు వెళ్తున్న టిప్పర్ పర్దీపూర్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కల్లెం హరి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాల పాలైన కల్లెం రామారావును కర్నూలుకు తీసుకెళ్లారు. అయితే ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

నిఖిత మృతి తేలేవరకు పోరాటం



మాట్లాడుతున్న సతీష్‌మాదిగ

అచ్చంపేట రూరల్: మన్ననూరు గురుకుల పాఠశాలలో మృతి చెందిన నిఖితది హత్యనా.. ఆత్మహత్యనా అనేది తేల్చి, దోషులను కఠినంగా శిక్షించే వరకు పోరాటం చేస్తామని నిఖిత న్యాయ జేఏసీ నాయకులు సతీష్‌మాదిగ, సోట కాశీం మాదిగ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిఖితను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఎంపీలు ఉన్నా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎలాంటి విచారణ చేయించలేదన్నారు. ఇప్పటివరకు నిఖిత కుటుంబానికి ఎలాంటి ఆర్థికసాయం చేయలేదన్నారు. రీపోస్టుమార్టం రిపోర్టును ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఎవరి ఒత్తిడి వల్ల రాత్రికి రాత్రే పోస్టుమార్టం చేయాల్సి వచ్చిందో సమాజానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేకు నిందితులతో సంబంధం ఉందని, వెనకేసుకొస్తున్నారని ఆరోపించారు. సంబంధం లేకుంటే కనకాల మైసమ్మ వద్ద ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కమిటీ వేసి ఎందుకు విచారణ చేయించలేక పోతున్నారన్నారు. ఈనెల 22 నుంచి వివిధ మండలాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తామని అన్నారు.

ప్రభుత్వ ఫలాలు అందరికీ దక్కాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బైరెడ్డి సతీశ్

అమ్రాబాద్: రాజ్యాంగంలోని హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించినప్పుడే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రొఫెసర్ బైరెడ్డి సతీశ్ అన్నారు. మంగళవారం రాత్రి అమ్రాబాద్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సామాజిక న్యాయం పూర్తిగా అమలు కావాలన్నారు. దేశంలోని 90 శాతం మంది జనాభా కోసం కల్పించిన రిజర్వేషన్లను బాధ్యతగా అమలు చేసినప్పుడే సామాజిక న్యాయం దక్కుతుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తూ నిరంకుశ పాలన సాగిస్తోందని ఆరోపించారు. కేంద్రం సాగిస్తున్న కార్పొరేట్ పాలనతో సామాన్యులకు ఇబ్బందికరంగా మారిందని దుయ్యబట్టారు. మహనీయులు అంబేద్కర్ ఏ ఒక్క కులానికో పరిమితం కాదని, ఆ యన అందరి కోసం ఆలోచించారని చెప్పారు. నల్లమలలో యురేనియం తవ్వకాలపై ప్రజల్లో ఇంకా అనుమానాలు ఉన్నాయని, అవసరమైతే ఎప్పుడూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఎల్లస్వామి, బీసీ సంఘం నాయకులు కాశన్న యాదవ్, నాసరయ్య పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

ధన్వాడ: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఇథనాల్ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలతో నీరు, గాలి, భూమి కలుషితం అవ్వడమే కాకుండా వ్యర్థాలు మన్నె వాగులో కలవడంతో భూగర్భ జలాలు, సాగునీరు తాగునీరు విషపూరితమై ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కోయిల్‌సాగర్ నుంచి నీటిని కంపెనీ వారు వినియోగించడంతో రైతులకు సాగు, తాగు నీరు అందకుండా పోతుందన్నారు. కుడి కాల్వకు నీటిని ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ.. కంపెనీ వారికి కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఇథనాల్ కంపెనీ వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు చక్రవర్తి, ఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సుదర్శన్, యాదగిరి, శ్రీను, నర్సింహులు, లక్ష్మయ్య, గోవింద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.